కథానిక

# హృదయంలేని ఉక్కు దేహాలు

శ్రీ కాశీభొట్ల సూర్యనారాయణ శాస్త్రిగారు

ఆమెకు యీ ప్రపంచంలో అన్ని ఐశ్వర్యాలూ ఆ శిశువే. అన్ని ధనధాన్యాలూ ఆ శిశువే. ఆమె జీవితరాశిలో అన్ని సంతోష తరంగాలు ఆ శిశువే. తన భవిష్యత్తుకు ఆ బిడ్డే భారమని, తన ఆశయాలకు ఆ శిశువే ఆధారమని, ఆ పసి పాపడే అమూల్యమైన పసిడిమూట అని అత్యంత ప్రేమాతిశయాలతో, ఎక్కువ గారాబంతో, ఒళ్ళంతా కళ్ళు చేసుకుని అతి శ్రద్ధగా పెంచుతోంది ఆ సుబ్బి. కాని, యీ ప్రపంచంలో ఆమె నిరాశ్రయజీవి—నిరుపేద.

"ఏడవకు బాబూ! ఏడవకు నా తండ్రి కాదూ! నా కాసుల పేరు కాదూ! నీకు చాలా పుణ్యముంటుంది. ఇదిగో ఆడుకో. ఈ రేకుడబ్బాతో ఆడుకో. మనకు ఆట వస్తువా ఆహారానికి ఆధారవస్తువా యిదే. ఈ రోజు నీకు పట్టెడు కూటికి కరువైంది. ఏ జన్మంలోనో పెట్టి పుట్టనిరోజు. ఏం చేస్తాం! నాన్నకదూ; నా బాబుకదూ!" అంటూ దుఃఖ భారంతో పొంగి పొర్లి పోయే కన్నీటి బొట్లను చిరిగిన పమిట చెంగుతో అదిమి ఆ చంటికూనను చంకను వేసుకుంది పాపం సుబ్బి.

గోడుగావున్న తడికతో గుడిసె గుమ్మాన్ని మూసి, సీనా రేకు డబ్బాను చేతితో పుచ్చుకుని, ఎఱ్ఱని వేసవి ఎండలో పట్టపగలు పదిగంటలకు, అన్నమో రామచంద్రా, అని అల మటించే ఆ బాలున్ని ఓదారుస్తూ, ఓ కంట నీరుకారుస్తూ-తడబడే అడుగులు వేస్తూ బయలు దేరింది బిచ్చానికి. ఆ బస్తీలో యీ బీదదానిపలుకు లాలకించే వారెవరూ? ఆ నిర్భాగ్యపు జీవితాన్ని నిండుచూపు చూసేదెవరు? ఆ దారిద్ర్యపు మానిసికి దానంచేసే దాత లెవరూ? ఆ దీనురాలి యిక్కట్టువిని ధర్మంచేసే దెవరూ?—

అట్లాగే తిరిగి తిరిగి భగ్గుమనే ఎండలో పాదాల్ని విదలించుకుని, ఆకలిమంటను అదిమి పెట్టి ఒక భాగ్యవంతుని యింటికి చేరుకుంది సుబ్బి. "అమ్మా! చంటి పిల్ల వాడికి పట్టెడు ముద్ద పెట్టరూ," అని అడిగింది ఆయాసంతో.

"నీకేం బుద్ధిలేదూ. అందరు తిని కూర్చున్నారు. అంట్ల గిన్నెలు ఖాళీగావున్నాయి. ఇప్పుడెక్కడ దొరుకుతుంది ముద్ద? పో! అట్లా పైకి పో!" అని గద్దించింది ఆ యింటి యిల్లాలు.

ఆ చింపిరి చెంగును బాలుని నెత్తిమీద కప్పుతూ అక్కడనుంచి వెళ్లిపోయింది నిరాశాహృదయంతో సుబ్బి.

ఆ ప్రక్కయింటి ఆయన భార్య కమ్మగా తిని, గుమ్మం వద్ద కూర్చుని తాంబూలం సేకరిస్తోంది. "తల్లీ! కొద్దిగా బువ్వ పెట్టరూ, అబ్బాయి గోల పెట్టి ఏడుస్తున్నాడు. కొద్దిగా కవళం పెట్టి పుణ్యం గట్టుకోండి అమ్మా!" అని అడిగింది సుబ్బి.

"ఆ! బువ్వ కావాలీ బువ్వ! గువ్వలాగ కూర్చో మరిగి-రోజూ యిదో పరిపాటై పోయింది. ఏదైనా పనిచేసుకుని బ్రతకరాదూ. ఎవడు చెప్పాడూ నీకీవేషం" అని హుంకరించింది ఆ అవ్వ.

అట్లాగే సత్తువలేని కాళ్లతో సాగిపోతూ, పొత్తిలిలోని బిడ్డని వత్తిపెట్టుకుంటూ స్థితిమంతుడైన ఒక వర్తకు డింటికి వెళ్లింది.

"అయ్యా! పసికందు గోల పెట్టి ఏడుస్తున్నాడు. ముష్టి దాన్ని రెండుబియ్యపు గింజలు బిచ్చం పెడుదురూ! బాబూ! వున్నవారు మాబోటి పేదల్ని కరుణించరూ అయ్యా!" అని బ్రతిమాలుతూవున్న సుబ్బిని డబ్బులెక్క పెట్టుకుంటూ వున్న ఆ షాహుకారు చూచి "అంత తిండిలేని దానవు యిక్కడికెట్లా రాగలిగావు. ఇక్కడికొచ్చే బదులు యింకో యింటికి పో పోయావ్? అంత నీరసంగావుంటే అడగటానికి నోరెల్లావచ్చింది. అతిగా మాట్లాడకు. నీతో మాట్లాడుతోంటే యివతల లెక్క మరచిపోతున్నా. నష్టమొస్తుంది. నీవే శనిఅమ్మోరు లావున్నావేం. పోతావా; పోవా?" అన్నాడు.

# హృదయం లేని ఉక్కు దేహాలు

ధనమే ప్రధానంగా తలచే ఆ ధనిక పాషాణ హృదయాలకి దయారసం ఎట్లా చిగురిస్తుంది? కడుపు నిండా తిని, కంటినిండా నిదురించే ఆ కఠిన జీవితాలకు పేదపిశాచక్షోభ యేం తెలుస్తుంది? మమకారశూన్యమైన ఆ మలిన దేహాలకి బీద ప్రజల రోదన ఏం వినిపిస్తుంది? ఆదరణాభిమానాలను ఆచరణలో పెట్టని ఆ ధనికవర్గానికి పేదల గోడు పదును కత్తుల పోటులు కాదూ!! సహకార సమానత్వ గుణాలు లేని యీ పాడులోకం వుంటేయేం, వూడితే యేం?

పాపం ఆట్లాగే కాళ్ళు కందిపోతూంటే ఆ పసి కందుని పమిటచెంగుతో మూసుకుని, కళ్ళంట కారే వేడి కన్నీటిని పాతపమిటతో అద్దుకుంటూ, ఆకలి బాధతో యెప్పటిలాగే నిరాశచెంది మొండి హృదయంతో ముందుకుసాగింది.

ఎదురుగా వెడుతూన్న వుద్యోగిని చూచింది. భరించరాని ఆకలిబాధతో 'బాబూ, అయ్యా! మీకు తోచింది ఏదైనా ధర్మం చేయరూ; కుఱ్ఱాడు మారాం పెట్టి ఏడుస్తున్నాడు. ప్రొద్దుటినుంచి చల్దికూడైనా లేదు. బాబూ కనికరించరూ; రక్షించరూ" అంటూ విలపిస్తూ ఆ వుద్యోగస్థుని పాదాలముందు వుంచింది ఆ చంటికూనని.

"ఏయ్! నాన్సెన్స్, ఛా! ఏమిటి ఏడవటం వెధవ గోలాను, అపశకునంలా యేడుస్తావేం? లే. తియ్యి పిల్లోణ్ణి" అన్నాడు కోపంతో గుడ్లు పెద్దవి చేస్తూను. "బాబూ! ఒక్క డబ్బు యియ్యరూ—పిల్లవాడికి కొని పెట్టి ఆకలి తీరుస్తా. మీ పేరు చెప్పుకుంటా"నంటూ బ్రతిమాలింది సుబ్బి. "ఎన్నిసార్లు చెప్పాలి, డబ్బూలేదు—ధర్మం లేదు! ముందు తీస్తావా తియ్యవా? ముష్టిముండ, నీకింత పట్టుదల దేనికి? వాళ్ళనీ వీళ్ళనీ బ్రతిమాలి ఎన్నాళ్లని బ్రతుకుతావు? దేనిలోనైనా పడి చావరాదూ!" అంటూ బిడ్డను పొట్టమీద బూటుకాలితో తన్ని వెళ్లిపోయాడు దురుసుతనంగా.

ఆహా! ఉద్యోగమదం యెంతపని చేసిందో!!

ఆకలి దుఃఖానికితోడు ఆ దెబ్బ గూడా మరింత అధికమైంది వెక్కి వెక్కి యేడ్చి ఆ శిశువును తీసుకుని యెత్తుకుని, హృదయానికి హత్తుకుని మరింతగా యేడవటం మొదలుపెట్టింది ఆ సుబ్బి. ఆ ఆర్తాలాపాన్ని ఆలకించేదెవరూ?

ధూళిలో పొర్లాడిన పిల్లవాడిని చూసింది ఒక్కసారి. హృదయం రాయి చేసుకుంది. ఉన్మాదంతో ముంచెత్తిన ఆలోచనలేవో ఆమె బుఱ్ఱలో పరుగెడుతున్నాయ్. కోపావేశం అధికతరమైంది. జీవితంమీద రోతపుట్టింది. ప్రపంచంమీద ప్రీతితప్పింది. "చంటి కూనకు పట్టెడు ముద్ద సంపాదించలేని యీ పాడుజన్మ ఎందుకు? ప్రేమతో చారెడు మెతుకులు పెట్టని యీ ప్రపంచం దేనికి? అలో లక్ష్మణా అని గోడ్చే యీ పేద హృదయాలను ఆదరించే దిక్కెవ్వరూ! ముష్టి వెధవని, దరిద్ర దేవతని, యింకా యీ ప్రపంచంలో నాకు సంబంధం యేమిటీ-క-ని-కా-రం-లే-దు" అంటూ యేవో పెద్ద పెద్ద కేకలు వేస్తూ వాయు వేగంతో విరక్తిమార్గాన విసురుగా నడచి పోతూ అచ్చటికి దగ్గిరగా వున్న నదియొడ్డున వృక్షచ్ఛాయని ఆ బిడ్డనివుంచి ఒక్క గంతున చెంగని నదిలోమునిగి అసువులను బాసింది పాపం సుబ్బి.

ఆ ఘోరదృశ్యాన్ని తిలకిస్తున్నాడొకవ్యక్తి. అపారమైనదయతో ఆ శిశువు నెత్తుకున్నాడు. ఆమె నదిలోపడిన వయినం నలుగురితో చెప్పాడు. అందరూ కలిసి నదిలో నలుదెసలా వెదికారు. కాని ప్రయోజనం లేక పోయింది. ఇహలోకాన్ని విడిచిపోయింది సుబ్బి అనుకున్నారందరును. అతనికి సంతతి లేక పోవటంవల్ల యీ బిడ్డను యీశ్వరుడు యీ రూపేణా ప్రసాదించాడని సంతోషించి 'రమేశం' అని నామకరణం చేశాడు ఆ శిశువుకు.

రమేశాన్ని పెంచి పెద్దవాణ్ణి చేశారు. పెంపుడు తలిదండ్రులు. పాఠశాలలో ప్రవేశబెట్టి విద్యాభ్యాసం చేయించారు. శ్రద్ధా భక్తులతో విద్యనభ్యసించి ఉద్యోగంలో చేరాడు క్రమేపి రమేశం. ఇప్పుడు రమేశం అంటే ఆ బస్తీలో ఎంతో పేరు. ఏంతో గౌరవం. ఎంతో పలుకుబడీను. పెద్ద పెద్దల అడుగు జాడలలో సంచరించి, వారి గౌరవాభిమానాలకు గురియై అనేకమైన బిరుదులు, డిగ్రీలు ఆ చిరకాలంలోనే సంపాదించాడు రమేశం.

కాని ఏంలాభం! చిన్నతనంలో మిక్కిలి ప్రేమతో పెంచిన తల్లి యిప్పుడు కళ్ళారాచూస్తే ఎంత సంతోషించేది! ఎంత ఆనందించేది! ఆమెకు యీ ప్రపంచంలో అన్ని ఐశ్వర్యాలూ ఆ శిశువేగా!!

★